
# మంచిమనిషి

ఆంధ్రభూమి వీక్లీ.. 25 మార్చి 2004



సమయం... రాత్రి పన్నెండు గంటలు!

లారీ నడుపుతున్న బాలు దృష్టి రోడ్డుపైనే ఉంది. అతనికి తెలుసు, తన ఏకాగ్రత ఏమాత్రం నడలినా తనతోపాటు ఎదురుగా వచ్చే వాహనాలలోని మరికొన్ని ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందని. అందుకే అతను డ్రైవ్ చేస్తున్నప్పుడు తాగడు- అప్పుడప్పుడు తాగడం అలవాటున్నా.

ఎదురుగా రోడ్డుపై ఇద్దరు వ్యక్తులు లారీని ఆపమన్నట్లు సైగచేస్తూ రోడ్డుకు అడ్డంగా నిలబడటంతో బ్రేక్ వేసి లారీని నిలిపాడు. ఆ ఇద్దరిలో ఒకరు అబ్బాయి, మరొకరు అమ్మాయి! ఇద్దరూ యుక్తవయసులో ఉన్నారు.

ఆ అబ్బాయి బాలు దగ్గరికి వచ్చి- "చెన్నై వెళ్లాలి. మమ్మల్ని తీసుకెళతారా?" అని అడిగాడు.

"నేనూ చెన్నైకే వెళుతున్నాను. కానీ..." అంటూ ఆ అమ్మాయి వైపు చూశాడు అనుమానంగా.

"ఆ అమ్మాయి తాలూకు మనుషులు ఏ క్షణంలోనైనా రావొచ్చు. మమ్మల్ని తీసుకెళ్లండి ప్లీజ్... బస్సు ఛార్జీకి రెండింతలు మీకిస్తాను" అన్నాడు ఆ అబ్బాయి.

"ఎక్కండి!"

ముందు ఆ అమ్మాయిని ఎక్కించి, తర్వాత తను లారీలోకి ఎక్కాడు ఆ అబ్బాయి.

లారీ కదిలింది. వాళ్ల ముఖంలో భయం చూసిన బాలుకు విషయం అర్థమైంది.

"లేచిపోయి వస్తున్నారా?" అని అడిగాడు వాళ్లను.

"కాదు.. పారిపోయి వస్తున్నాం! మేమిద్దరం ప్రేమించుకున్నాం. చెన్నైకి వెళ్లి అక్కడ పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాం" ఆ అబ్బాయి చెప్పాడు.

"చెన్నైలో ఎవరున్నారు?"

"మా అమ్మానాన్నా! నేను చెన్నైలో చదువుకుంటున్నాను."

"ఏం చదువుతున్నావు?"

"ఎం.ఎస్.సి."

"ఈ అమ్మాయి చదవడం లేదా?"

"తను బి.కామ్. చదువుతూంది... కావలిలో!"

"మరి, ఆ అమ్మాయి చదువయ్యాకే ఈ పని చేసివుండాల్సింది మీరు!" అన్నాడు బాలు.

అతను జవాబు చెప్పలేదు.

చెన్నైలో ఉంటున్న అబ్బాయికి- కావలిలో ఉంటున్న అమ్మాయితో ఎలా పరిచయం అయి, ప్రణయంగా మారిందో బాలుకు అర్థంకాలేదు. అదే విషయం ఆ అబ్బాయిని అడిగితే వివరాలు తెలిసాయి.

ఆ అబ్బాయి పేరు సురేష్, ఊరు చెన్నై. తల్లిదండ్రులు ఉద్యోగస్థులు. అతనితోపాటు ఎం.ఎస్.సి. చదువుతున్న ఓ స్నేహితుడు కావలి వాస్తవ్యుడు.

అతని పేరు గిరి! సురేష్ సెలవుల్లో గిరితో కావలికి వచ్చాడు. గిరి ఎదురింట్లో ఉన్న లక్ష్మి అనే అమ్మాయితో సురేష్ చూపులు కలిపాడు. ఆ తర్వాత మాటలు, చేతులు కూడా కలిపాడు. వారంరోజులు కావలిలో ఉండి చెన్నై వెళ్లిపోయాడు. అయితే ఫోన్ ద్వారా వారి ప్రేమ కొనసాగింది. క్రమంగా ఒకరిని విడిచి ఒకరు ఉండలేని స్థితికి వచ్చారు. వేసవి సెలవుల్లో తను కావలి వస్తాననీ, తనతోపాటు చెన్నై వచ్చేస్తే ఇద్దరూ పెళ్లి చేసుకోవచ్చనీ లక్ష్మితో చెప్పాడు సురేష్. లక్ష్మి సరేనంది. అనుకున్న ప్రకారం సురేష్ కావలికి వచ్చి, లక్ష్మికి ఫోన్ చేశాడు. తల్లిదండ్రులు నిద్రపోయాక చిన్నసంచిలో బట్టలు సర్దుకొని, వీధి చివరికొచ్చి సురేష్‌ను కలిసింది లక్ష్మి. ఆమె తల్లిదండ్రులు జరిగింది తెలుసుకునేలోపు ఊరు దాటాలని- తమకు మొదట కనిపించిన వాహనాన్ని ఆపి, అందులో ఎక్కడం జరిగింది.

బాలుకి ఎందుకో వాళ్లు చేసినపని తప్పనిపించింది.

డ్రైవ్ చేస్తూ వాళ్లవైపు చూశాడు.

ఆ అబ్బాయి నిద్రపోతున్నాడు. నిద్రలో తన తలను ఆ అమ్మాయి భుజంపై ఆనించి తూలుతూంటే ఆ అమ్మాయి అతని తలపై చేతులుంచి, తన భుజంవైపు హత్తుకుంది.

చూస్తున్న బాలుకు ఒళ్ళు మండిపోసాగింది. తొమ్మిది నెలలు మోసి, కనిపెంచిన తల్లి గురించి ఆలోచించలేదు. ఇన్నేళ్ళూ సంపాదించి పోషించిన తండ్రి గురించి ఆలోచించలేదు. కొద్దిరోజుల పరిచయం మాత్రమే ఉన్న ప్రియుడికి ఇబ్బంది కలగకుండా, అతనికి నిద్రాభంగం కాకుండా ఆమె జాగ్రత్త తీసుకోవడం అతనికి చిరాకు కలిగించింది. 'సినిమాల ప్రభావం' అనుకున్నాడు.

తర్వాత ఆ అమ్మాయితో సంభాషణ ప్రారంభించాడు...

"నీ పేరేమిటమ్మా?"

"లక్ష్మి..."

"చక్కటి పేరు! నువ్వు పుట్టగానే ఇంట్లో మహాలక్ష్మి పుట్టిందని మీ అమ్మానాన్నా సంబరపడి ఆ పేరు పెట్టుంటారు. నువ్వు బాగా చదువుకుని తమ ఆశలు నెరవేరుస్తావని, నిన్ను మంచి వరుడికిచ్చి పెళ్ళిచెయ్యాలని, మెట్టినింట్లో నువ్వు చక్కగా ప్రవర్తించి తమకు మంచిపేరు తీసుకు వస్తావని ఎన్నో కలలు కని ఉంటారు. నువ్వు ఇలా లేచిపోయిన విషయం తెలిసి ఎంత షాక్ తింటారో..?!" అంటూ ఆమె వైపు చూశాడు. ఆమె కూడా తన తల్లిదండ్రుల గురించే ఆలోచిస్తున్నదని అనిపించింది అతనికి... ఆమె ముఖం చూస్తుంటే.

"నిన్ను తన ఇంటికి పిలుచుకొని వెళుతున్నాడా సురేష్?"

"ఇంకా ఆ విషయం ఆయన్ని అడగలేదు."

"తన తల్లిదండ్రులతో విషయం చెప్పాడా?"

"ఇంకా చెప్పలేదు."

"మరెలా..? అబ్బాయి తల్లిదండ్రులు అంత సులభంగా ఇటువంటి వాటిని అంగీకరించరు. వాళ్ళ పిల్లవాడి గురించి వాళ్ళకు ఆశలు ఉండటం సహజమే కదా! కొంతమంది తల్లిదండ్రులు కట్నం, లాంఛనాలు బాగా వచ్చే సంబంధం కావాలనుకుంటారు. ఇంకొందరు అమ్మాయి అందంగా ఉండి, మంచికుటుంబంలో ఉన్నదైతే చాలనుకుంటారు. ఉద్యోగానికి, పెద్దచదువులకు, స్నేహబంధాలకు, కీర్తి ప్రతిష్టలకు ప్రాముఖ్యత నిచ్చేవాళ్ళు కూడా ఉంటారు. ఇలా తల్లిదండ్రులతో చెప్పకుండా ఇల్లు వదిలి పారిపోయి వచ్చేసే అమ్మాయిల్ని తొంభైతొమ్మిది శాతం తల్లిదండ్రులు తమ కోడలిగా ఆహ్వానించరు."

లక్ష్మి అతని వైపు భయంగా చూసింది.

"వాళ్ళు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా తన ఇంటికే నిన్ను తీసుకెళ్లమను. హోటల్‌లో ఉంచుతానంటే ఒప్పుకోకు. పోలీస్ రైడింగులూ అవీ ఉంటాయి. నువ్వు ఒంటరిగా ఉన్నా ఇబ్బందే- సురేష్‌తో ఉన్నా ఇబ్బందే! పైగా... పోలీసులు మీ అమ్మానాన్నలకు ఫోన్‌చేసి రప్పిస్తారు. వాళ్ళు తట్టుకోలేరు- నిన్ను పోలీస్‌స్టేషన్లో చూస్తే! స్నేహితుల గదిలో ఉంచుతానంటే ఒప్పుకోకు. ఒంటరి ఆడపిల్లను చూస్తే బుద్ధిమంతుడికి కూడా బుద్ధులు మారిపోతాయి."

రోడ్డువైపే చూస్తూ ఆలోచిస్తున్న లక్ష్మి- 'ఇతను మంచి డ్రైవరే కాదు, మంచి వక్త కూడా. దృఢనిశ్చయంతో ఇల్లు వదిలి వచ్చిన తనను మళ్లీ ఆలోచనల్లో పడవేస్తున్నాడు!' అనుకొంది.

"ఇంతకూ మీ ప్రేమ గురించి మీ అమ్మానాన్నల్తో చెప్పావా నువ్వు?" కొంతసేపటి తర్వాత అడిగాడు.

"లేదు. వాళ్ళు ఒప్పుకుంటారన్న నమ్మకం నాకు లేదు..."

"కానీ, నీ ప్రియుడి మంచితనం మీద, నిజాయితీ మీద మాత్రం నీకు చాలా నమ్మకం! అసలు ఈ సురేష్ గురించి నీకెంత తెలుసు? ఏం తెలుసని బయలుదేరావు అతనితో? రేపు చెన్నై వెళ్లాక- అతను మంచివాడు కాదని, నిన్ను కొద్దిరోజులు వాడుకోవడానికే నిన్ను తీసుకొచ్చాడనీ తెలిసిందనుకో... అప్పుడేం చేస్తావు? మళ్లీ మీ ఊరికి పోలేవు. అక్కడే బ్రతుకు లాగడానికి నీ చదువు సరిపోదు. పైగా- మోసగింపబడ్డావని మనసులో బాధ! చెప్పమ్మా... ఆ పరిస్థితి వస్తే ఏం చేస్తావు?"

"ఆత్మహత్య చేసుకుంటాను..." కళ్ళనీళ్లతో అంది లక్ష్మి.

"అంతకంటే మీ అమ్మానాన్నల్తో హాయిగా ఉండిపోయుండొచ్చుగా! మీ అమ్మ ఒడిలో తలపెట్టుకొని టీవీ చూడొచ్చు. కాఫీ త్రాగుతూ మీ నాన్న చెప్పే కబుర్లెన్నో వినవచ్చు. కాలేజీలో స్నేహితురాళ్ళతో ఎన్నో ముచ్చట్లు చెప్పుకోవచ్చు. పెళ్ళి చేసే సమయం వస్తే మీ తల్లిదండ్రులే మంచికుర్రాడి కిచ్చి నీ పెళ్ళి చేస్తారు. అప్పుడు గౌరవంగా, మనసులో ఎటువంటి భయం, బాధ లేకుండా హాయిగా నీ భర్తతో జీవనం సాగించవచ్చు."

వెక్కివెక్కి ఏడవసాగింది లక్ష్మి. ఆమె తన తల్లిదండ్రులతో గడిపిన మధురక్షణాలన్నీ గుర్తొచ్చి ఏడుస్తున్నదని అనుకున్నాడు బాలు.

"అమ్మా... ఏడవకు... సురేష్ లేస్తే బాగుండదు."

లక్ష్మి ఏడుపు ఆపి మౌనంగా కూర్చుంది. వీధిదీపాలు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తూండటంతో నెల్లూరుకు దగ్గరౌతున్నామని తెలిసింది ఆమెకు.

లారీ ఆగడంతో సురేష్‌కి మెలకువ వచ్చింది.

"ఏమయింది..?" కళ్ళు నులుముకుంటూ అడిగాడు.

"నిద్ర వస్తూంది. టీ త్రాగాలి. మీరూ దిగండి, టీ తాగుదురుగాని!"

"నెల్లూరు వచ్చిందా?"

"నెల్లూరు రాదు... మనమే నెల్లూరు చేరాలి. ఇంకో కిలోమీటరు దూరం ఉంది!" అన్నాడు నవ్వుతూ.

"సారీ... మనం టౌన్లో కెళ్తున్నామా?"

"లేదు... బైపాస్ రోడ్డులో వెళ్తున్నాం. నెల్లూరులో మీకు పనేదైనా ఉందా?"

"లేదు... ఊరికే అడిగాను."

ముగ్గురూ టీ త్రాగారు. టీకి సురేష్ డబ్బులిచ్చాడు. టీ బంకు ప్రక్కనే ఎస్.టి.డి. బూత్ ఉండటం గమనించి, "నేను ఫోన్‌కాల్ చెయ్యాలి. నువ్వు వెళ్లి బండిలో కూర్చో!" అన్నాడు లక్ష్మితో.

"నాకు భయం! నేనూ నీతోనే ఉంటాను" అంది లక్ష్మి.

"డ్రైవరు ఉన్నాడుగా! ఏం భయం లేదు... వెళ్లు!"

"నేను వినకూడదా..?"

"వినాల్సిన అవసరం లేదు. ప్లీజ్... నా మాట విను!"

మరేం మాట్లాడకుండా లారీ దగ్గరికి వెళ్లి నిలబడింది.

సురేష్ ఫోనులో మాట్లాడి బయటకొస్తూంటే బాలు అతనికి ఎదురొచ్చాడు.

"ఏమిటి?"

"మా ఆవిడకు ఫోన్‌చేసి వస్తాను. మీరు బండిలో కూర్చోండి. ఆ అమ్మాయి భయపడుతోంది!" అన్నాడు బాలు.

"డబ్బులివ్వనా?"

"వద్దు... నా దగ్గర ఉన్నాయి."

బాలు లోపలికి వెళ్లి రిసీవరు తియ్యబోతూ అక్కడ ఉన్న డైరీలాంటి చిన్న పుస్తకాన్ని చూశాడు. పర్సనల్ టెలిఫోన్ డైరెక్టరీ అది. మొదటి పేజీలో 'సురేష్' అని రాసి ఉంది.

• • •

**లా**రీ ఎక్కి సీటులో కూర్చుని, "సురేష్ బాబూ... ఈ డైరీ మీదేనా?" అని చేతిలో ఉన్న డైరెక్టరీని చూపాడు.

"అవును... అక్కడే వదిలేశానా? థాంక్యూ!" అంటూ అందుకొని, జేబులో పెట్టుకున్నాడు.

లారీ స్పీడుగా వెళ్తోంది. చల్లటి గాలికి సురేష్‌కు మళ్లీ నిద్ర ముంచుకురాసాగింది.

"నేను నిద్రపోతే ఫరవాలేదా?" బాలును అడిగాడు.

"నిద్రపోండి!"

"తోటిప్రయాణీకులు నిద్రపోతే- డ్రైవరు కూడా నిద్రపోయే ప్రమాదం ఉందని విన్నాను?!"

"ఆ మాట నిజమే! అయితే నాతో అలాంటి ఇబ్బంది లేదు. మీరు నిశ్చింతగా నిద్రపోవచ్చు!"

అయిదు నిముషాల్లో సురేష్ నిద్రలోకి జారిపోయాడు.

"ఏమ్మా... నీకూ నిద్ర వస్తోందా?" లక్ష్మివైపు చూస్తూ అడిగాడు.

తల అడ్డంగా ఊపింది లక్ష్మి.

"నిన్ను చూస్తే చెల్లెళ్ళు లేని నాకు ఓ చెల్లెలిలా కనిపించావు. అందుకే నీ క్షేమం కోరి నేనో పని చేశాను. అది తప్పని తెలిసినా కూడా!"

ఏమిటన్నట్టు చూసింది.

"సురేష్ ఫోన్ పెట్టి వచ్చాక, మా ఆవిడకు ఫోన్ చేయాలని వెళ్లి రీడయల్ చేశాను. సురేష్ స్నేహితులతో సురేష్ మాట్లాడినట్లే మాట్లాడాను. బాక్స్ తలుపు తెరిచి వాహనాల శబ్దం వల్ల నా గొంతు విని వాళ్ళను అనుమానం కలగకుండా చేశాను. వాళ్ళ మాటలు వల్ల సురేష్ నిన్ను తన స్నేహితుని గదిలో ఉంచుతాడని అర్థమైంది. వాళ్ళ అరుపులూ, కేరింతలూ వింటూంటే నాకు ఎందుకో అతనిపై అనుమానం వస్తోంది!" అన్నాడు.

లక్ష్మి ఏం మాట్లాడలేదు. తన వెనక్కి వాల్చి కళ్ళు మూసుకొని కూర్చుంది. బాలు స్పీడు పెంచాడు. పావుగంట తర్వాత "నేను ఇంటికి వెళ్లిపోతాను... నన్ను బస్సు ఎక్కించండి ప్లీజ్!" అంటూ రెండుచేతులూ జోడించింది.

"మరి, సురేష్‌తో చెన్నై వెళ్లవా?"

"వెళ్లను. నన్ను కావలికి చేర్చే ఏర్పాటు చేయండి!" అంది ఏడుస్తూ.

"కావలి వచ్చింది. మీ ఇల్లెక్కడో చెప్పు?"

"కావలి వచ్చిందా? ఇది గూడూరు కాదా?" ఆశ్చర్యంగా అడిగింది.

"కాదు. నేను చెప్పింది విన్నాక- నువ్వు మనసు మార్చుకొని మీ ఇంటికి తీసుకెళ్లమని నన్ను అడుగుతావని నాకు తెలుసు. అందుకే బండిని వెనక్కి తిప్పాను."

ఆమెను ఇంటి దగ్గర దింపి, ఓ కాగితం ఆమె చేతిలో పెట్టాడు.

"మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను'' మళ్లీ అతనికి రెండుచేతులూ జోడించి నమస్కరించింది.

తర్వాత దగ్గరగా వేసి ఉన్న తలుపు తీసుకొని తలుపు గడియ వేసి, ఇంట్లోకి వెళ్లింది. తల్లీతండ్రీ నిద్రపోతున్నారు. 'తను ఇల్లు వదలివెళ్లిన విషయం వీళ్ళకు తెలియదు. థాంక్ గాడ్!' అనుకొని, బాత్‌రూమ్ కెళ్లి, ముఖం కడుక్కొని బాలు ఇచ్చిన కాగితం తీసి చదవసాగింది-

"చెల్లెమ్మా! నన్ను క్షమించు. నేను సురేష్ స్నేహితులతో మాట్లాడానని నీతో అబద్ధం చెప్పాను. సురేష్ మంచివాడు కావొచ్చు, చెడ్డవాడూ కావొచ్చు. కానీ, నువ్వు అలా తల్లిదండ్రులకు చెప్పకుండా బయలుదేరడం తప్పు. నేనూ నా భార్యను ప్రేమించి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాను. క్రమశిక్షణకు ప్రాణం యిచ్చే ఆమె తండ్రి ఆ నిజం జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత మా పెద్దలూ, ఆమె పెద్దలూ మమ్మల్ని తమలో కలుపుకొని ఆదరించారు. అయితే పోయిన ఆమె తండ్రి తిరిగిరాడు కదా! తన వల్లే తన తండ్రి పోయాడన్న బాధ ఇప్పటికీ ఆమెను కలవరపెడుతూనే ఉంది. ఆ బాధ నీకు ఉండకూడదని నేనిలా చేశాను. అయితే సురేష్ టెలిఫోన్ డైరెక్టరీ నుంచి నెంబరు ఎన్నుకొని నన్ను నీ అన్నగా పరిచయం చేసుకొని మీ పెళ్ళికి అతని తల్లిదండ్రుల స్పందన ఎలా ఉంటుందని అడిగాను. వాళ్ళు డబ్బున్న అహంకారులని, నిన్ను తమ ఇంట్లో అడుగుపెట్టనిచ్చే ప్రసక్తే లేదని, సురేష్ ఇప్పటికీ తల్లిని చూసి బెదురుతుంటాడని చెప్పారు. అందువల్ల నా సలహా ఏమిటంటే... మీరిద్దరూ చదువు పూర్తిచెయ్యండి. సురేష్‌కి ఉద్యోగం వచ్చాక కావలికి వచ్చి మీ తల్లిదండ్రులతో మాట్లాడమను. వాళ్ళూ ఎంతో సంతోషంగా ఒప్పుకుంటారు మీ పెళ్ళికి!

సురేష్‌కి నేను నచ్చచెప్పి చెన్నై వాపసు పంపిస్తాను. మళ్లీ ఇంకోసారి ఇలా చేయవని నమ్ముతూ...

- నీ అన్నయ్య

బాలు."

మరోసారి బాలుకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుని, తల్లి ప్రక్కన పడుకుంది లక్ష్మి. నిద్రలో తల్లి లక్ష్మిపై చెయ్యివేసి దగ్గరకు తీసుకొంటే... తనూ తల్లిని కౌగలించుకొని పడుకొంది నిశ్చింతగా.

• • •

నెల్లూరు చేరిన తర్వాత సురేష్ నిద్రలేచాడు.

ప్రక్కన లక్ష్మి లేకపోవడం చూసి "లక్ష్మి ఏదీ?" అని కంగారుపడుతూ బాలును అడిగాడు.

"మీరు నిద్రపోగానే తల్లిదండ్రులను తలచుకొని ఏడవసాగింది. తను ఇంటికి వెళ్లిపోతాననీ, బస్సు ఎక్కించమనీ కోరింది. నాకు జాలివేసి మళ్లీ కావలి వరకూ వెళ్లి ఆమె ఇంటి దగ్గర వదిలాను."

"యూ ఫూల్... ఎంత పని చేశావురా? బుద్ధి లేకుండా నీ లారీ ఎక్కాను. పడ్డ శ్రమంతా వేస్ట్ అయిపోయింది. నిజంగా బస్సు ఎక్కించావా, లేక నువ్వే ఏమైనా చేశావా? చెప్పు?"

"నేను నిజమే చెప్పాను. నమ్మడం, నమ్మకపోవడం మీ యిష్టం!" అన్నాడు బాలు.

సురేష్ బాలును నోటికి వచ్చినట్లు తిట్టసాగాడు.

లారీ ఆగింది. బాలు క్రిందకి దిగాడు. సురేష్ కూడా దిగి-

"చెప్పరా... ఆ అమ్మాయినేం చేశావు? నిజం చెప్పకుంటే పోలీస్‌రిపోర్ట్ ఇస్తాను. నీ లారీనెంబరు ఇచ్చానంటే నువ్వెక్కడున్నా పోలీసులు పట్టుకుంటారు. మా నాన్నగారి పరపతి గురించి నీకు తెలీదు" అన్నాడు ఆవేశంగా.

బాలు తీక్షణంగా సురేష్ వైపు చూశాడు ఓ క్షణం! మరుక్షణం సురేష్ చెంప పగిలిపోయింది.

"ఇవ్వరా కంప్లైంటు... ఏమని ఇస్తావు? అభం శుభం తెలియని అమ్మాయిని కవ్వించి లేపుకొచ్చానని, ఆమె కనిపించడం లేదని ఇస్తావా? అయినా... మూతిమీద మీసమైనా ఇంకా సరిగ్గా మొలవలేదు నీకు- అప్పుడే పెళ్ళాం కావాల్సి వచ్చిందిరా? నయాపైసా సంపాదన లేదు... కాపురం పెడతావా? 'ప్రక్కన ఆ అమ్మాయి ఉందా, లేదా...' అనికూడా తెలియనంత మొద్దునిద్రపోయే నువ్వు- ఆ అమ్మాయికి ఏం రక్షణ ఇస్తావు? ఎలాంటి బాధ్యతలు నిర్వహిస్తావు? వెళ్లు... అదిగో నెల్లూరు బస్టాండు- బస్సు ఎక్కి చెన్నై వెళ్లిపో. చదువు పూర్తిచేసుకొని, ఉద్యోగం తెచ్చుకొని, అప్పటికీ నీకు ఇంకా లక్ష్మిమీద ప్రేమ ఉంటే కావలికి వెళ్లి ఆమె తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్ళి చేసుకో. వాళ్ళు ఒప్పుకోకపోతే ఈరోజు చేయబోయిన పని ఆరోజు చెయ్యి... బై!" అంటూ లారీ వైపు కదిలాడు.

వెళ్తున్న అతన్నే చూస్తుండిపోయాడు సురేష్.

లారీలో కూర్చుని - "లక్ష్మి వాళ్ళింట్లో క్షేమంగా ఉంది. నీకు అనుమానముంటే బస్టాండులో ఎస్.టి.డి. బూత్ ఉంటుంది. ఫోన్‌చేసి కనుక్కో. అంతవరకూ నేను ఇక్కడే ఉంటాను" అని లారీ ఇగ్నిషన్ కీస్ సురేష్‌కు ఇవ్వడానికి చేయి చాచాడు.

సురేష్ కూడా చేయి చాచాడు. కీస్ అందుకోవడానికి కాదు- అతని చేయి అందుకోవడానికి!

"సారీ... నేను చేసింది తప్పే! నాకు ఉద్యోగం వచ్చాక మా అమ్మానాన్నల్ని ఒప్పించి లక్ష్మిని పెళ్ళి చేసుకుంటాను. మీవల్ల మా ఇద్దరికీ మంచి జరిగింది. మాలో ఆందోళన, తప్పు చేస్తున్న ఫీలింగ్ దూరమైంది. ఐ యామ్ గ్రేట్‌ఫుల్ టు యూ!" అన్నాడు షేక్‌హ్యాండ్ ఇస్తూ.

"గాడ్ ఈజ్ గ్రేట్! యు మస్ట్ బి థాంక్‌ఫుల్ టు హిమ్!"

సురేష్ బాలు వైపు ఆశ్చర్యంగా చూస్తూ "మీరు ఎంతవరకూ చదువుకున్నారు?" అని అడిగాడు.

"ఎం.ఏ. చదివాను. అంతకంటే ఎన్నో జీవితాల్ని చదివాను. ఎవరైనా చేతులారా తమ జీవితాల్ని నాశనం చేసుకుంటూంటే చూస్తూ ఉండలేను. నేను వస్తాను... బై!"

లారీ కదిలింది..!

సురేష్ చెయ్యి ఊపసాగాడు- వీడ్కోలు చెబుతూ. తర్వాత అటువంటి మంచిమనిషిని తిట్టినందుకు పశ్చాత్తాప పడుతూ బస్టాండు వైపు నడిచాడు సురేష్.